సీరియల్

రాక్షసహేల

వాణిశ్రీ

(గత సంచిక తరువాయి)

"చస్తే యేమిటి?"

"కోపం వద్దు నందితా! ప్లీజ్ ఎక్స్‌క్యూజ్ మీ! ఐ యామ్ వెరీ వెరీ సారీ!"

శ్రీనాథ్ ఆమె దగ్గరగా వచ్చాడు.

ఆమె భుజంమీద చెయ్యి వేశాడు. విసిరికొట్టింది.

"నన్ను ముట్టుకోకు."

"మొన్న మొన్నటివరకు మనం నగ్నంగా ఆ బెడ్ మీద సుఖపడ్డాం. అదంతా నీకు గుర్తురావడంలేదా? నేను ఆ మధురక్షణాలు మరువలేకుండా వున్నాను నందితా! నువ్వు గుర్తువచ్చి పిచ్చెక్కిపోతోంది."

శ్రీనాథ్ ఆమెను కౌగలించుకొని బలవంతంగా ముద్దు పెట్టుకున్నాడు.

నందిత అతన్ని విసురుగా నెట్టింది.

అతను అది ఊహించలేక వెల్లకిలా పడ్డాడు.

అతనికి కోపం ముంచుకొచ్చింది. బ్రతిమాలే కొద్దీ నెత్తిన యెక్కుతుందే. దీన్ని యిలా కాదు అను కున్నాడు.

"నువ్వు నా వైఫ్‌వి. నాతోపాటు రా!" అంటూ ఆమె జబ్బ పట్టుకుని విసురుగా రూమ్‌లో నుంచి లాక్కె

చ్చాడు!

"యూ! ఫూల్. గెటౌట్" అని కేకలు పెట్టింది నందిత.

నందిత అరుపులకు రాజేంద్రప్రసాద్ వచ్చాడు. పెద్ద గొడవ అయింది. మామా, అల్లుడు మాటకి మాట అను కున్నారు.

శ్రీనాథ్‌ని నౌకర్లతో బలవంతంగా బైటకు పంపించాడు రాజేంద్రప్రసాద్.

"నా కూతురికి యిష్టం లేకుండా మీద చెయ్యి వేశావంటే సహించను. నీ అంతు చూస్తాను" అని వార్నింగ్ ఇచ్చాడు.

శ్రీనాథ్ అవమాన భారంతో అక్కడ్నుంచి బైట పడ్డాడు.

అతని ముఖం చూసే తెలుసుకొన్నాడు కిరణ్ కథ అడ్డం తిరిగిందని.

శ్రీనాథ్ జరిగిందంతా చెప్పాడు.

"డోంట్ వర్రీ! టైమ్ విల్ సాల్వ్ ద ప్రాబ్లమ్స్" అన్నాడు.

"నందిత మళ్ళీ నన్ను రానిస్తుందంటావా?" విచారంగా అడిగాడు శ్రీనాథ్.

"చచ్చినట్టు రానిస్తుంది. ఇప్పుడు తండ్రి అండ వుంది కాబట్టి పొగరుగా బిహేవ్ చేస్తోంది. రేపు వాడు చచ్చాక నువ్వే గతి" అన్నాడు కిరణ్.

శ్రీనాథ్ ఆశ్చర్యంగా చూశాడు.

"అతను అప్పుడే చావడం యేమిటి? దున్నపోతులా వుంటేను" అన్నాడు.

కిరణ్ నవ్వాడు.

"అలాగే వుంటారు. హార్ట్ ఎటాక్‌తో హరీ అంటారు. అంతా మినిట్స్‌లో జరిగిపోతుంది. అంతలావు శరీరంలో యెన్ని రోగాలు కాపురం చేస్తున్నాయో యెవరికి తెలుసు?"

"ఏమోరా! వాడు చచ్చి, నంటర నాకు దక్కినప్పటి సంగతి కదా! అది ఎన్నేళ్ళకో."

"నువ్వు వర్రీకాకు. వాడు రోగంతో చావకపోయినా మర్డర్ చేయబడతాడు."

శ్రీనాథ్ నోరు తెరిచాడు.

"ఎవరు మర్డర్ చేస్తారు?"

"ఎవరో యెందుకు? ఆయనగారి బావమరిది లేడూ దశరథ్. వాడే మర్డర్ చేసేస్తాడు. స్వార్థానికి అడ్డు తగిలితే అంతే మరి" అన్నాడు కిరణ్.

"వాడు తొందరగా మర్డర్ చేస్తే బాగుండును" అన్నాడు శ్రీనాథ్.

"పోనీ నువ్వే మర్డర్ చేసెయ్యరాదూ?" నవ్వుతూ భుజం చరిచాడు కిరణ్.

"అమ్మో! నేనా!" అని గుండెమీద చెయ్యి వేసుకున్నాడు.

"జోక్ చేశాన్లేరా! నీ గుండె ధైర్యం నాకు తెలీదూ?"

"వాడు చావడం సంగతి తర్వాత గాని, నే నిప్పుడు యేం చెయ్యాలి?...." బేలగా అడిగాడు శ్రీనాథ్.

"ఏం చెయ్యడం యేమిటి? నీ కిష్టమయిన ఇండస్ట్రి మొదలుపెట్టు. లైసెన్సులు అవీ తెచ్చుకోవాలిగా!"

"నా తొందరలా వుంది. డబ్బు కావొద్దూ!" అన్నాడు

శ్రీనాథ్.

"నీ కొంపదలా వుంది. బ్యాంక్‌లో డబ్బు పెట్టుకొని, డబ్బు, డబ్బు అంటా వేమిటి?"

"బాంక్‌లో వుందా?"

"అవున్రా వెధవాయ్! మీ మామ నీ పేరుతో పది లక్షలు బ్యాంక్‌లో వేశాడు. అది తియ్యాడం ఎవరి వల్లా కాదు. దర్జాగా ఖర్చు పెట్టుకో" అన్నాడు.

శ్రీనాథ్ ముఖంలోకి వెలుగొచ్చింది

"మైగాడ్" అని ఆశ్చర్యపోయాడు.

ఇప్పుడతనిలో వర్రీ తగ్గిపోయింది.

31

స్రవంతి ఫైనాన్స్ కంపెనీ ఆఫీసులో మేనేజర్ ఎదుట కూర్చుని వున్నాడు ఆర్. కె. రాధ.

అతను చాలా వర్రీడ్‌గా వున్నట్లు చూడగానే తెలిసి పోతోంది. నల్లగా, తుమ్మెదలా వున్న అతని కళ్ళు ఎర్రగా నిప్పుల్లా మెరుస్తున్నాయి. ఏ.సి. రూమ్‌లో కూడా అతనికి చెమట్లు పడుతున్నాయి. మేనేజర్ రాఘవన్ వైపు దీనంగా చూస్తున్నాడు. కాని రాఘవన్ ఎటో చూస్తున్నాడు.

"ప్లీజ్ రాఘవన్ గారూ! మీరీ సహాయం చెయ్యకపోతే చచ్చిపోతాను" మరొకసారి అన్నాడు ఆర్. కె. రాధ.

"ఐయామ్ సారీ రాధాగారూ! నా చేతుల్లో ఏమీ లేదు. మా పార్ట్‌నర్ని కలుసుకోండి. ఆయన ఒప్పుకుంటే నాకేం అభ్యంతరము లేదు. ఎందుకంటే డబ్బంతా ఆయనదే. నాది చాలా తక్కువ. నామ్‌కే వాస్తే"

అన్నాడు మేనేజర్.

“ఆయనా?... ఆయన్ని కలుసుకున్నా ఒకటే. లేక పోయినా ఒకటే. ఏదయినా చేస్తే మీరే చెయ్యాలి” అన్నాడు ఆర్. కె. రాధ.

“నేనేం చెయ్యలేనండి” అన్నాడు రాఘవన్.

“ప్లీజ్! పరిస్థితి అర్థం చేసుకోండి” ఆర్. కె. రాధ ప్రాధేయపడసాగాడు.

“చూడండి రాధాగారూ! ఒకటి కాదు రెండు కాదు. పాతిక లక్షలు. వడ్డీతో ముప్పై లక్ష లయ్యింది.”

“నేను కాదనడంలేదు. సగం ఇస్తానంటున్నాను. మిగతా సగానికి కొన్ని యేరియాలు మిగిలివున్నాయి. మీకు భయం యేమిటి?” ఆర్. కె. రాధ మేనేజర్ని ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు.

తెలుగు చలనచిత్రసీమలో ఆర్. కె. రాధ ఇప్పుడు పెద్ద ప్రొడ్యూసర్. పాతిక సంవత్సరాలుగా ఫీల్డులో వుంటున్నాడు. బాయ్‌గా జీవితం మొదలుపెట్టి అంచె లంచెలుగా ఎదిగి ప్రొడ్యూసర్ అయ్యాడు. పదేళ్ళుగా పది బడ్జెట్ పిక్చర్స్ ప్రొడ్యూస్ చేశాడు. కొన్ని హిట్ అయ్యాయి. కొన్ని యావరేజ్‌గా పొయ్యాయి. రెండు మూడు ఫ్లాఫ్‌లు అయ్యాయి.అయినా ఇంత ఇరకాటంలో అతను ఎప్పుడూ పడలేదు.

పది పిక్చర్స్ తీసినా పదిలక్షలు సంపాదించడం గగనమైపోయింది. అటువంటిది ఇటీవల ఒక్క పిక్చర్ తీసి పాతిక లక్షలు మూటగట్టిన వాళ్ళున్నారు. ఫీల్డులో చిత్రమైన మార్పు ఉప్పెనలా వచ్చిపడింది. బడ్జెట్ సినిమాలు మూలపడ్డాయి. మరి నలుగురు హీరోలుంటే

చాలు జిల్లా డిస్ట్రిబ్యూటర్స్ అడ్వాన్సులు ఇచ్చి ఎగబడ్డారు. కోటి రూపాయలైనా కొనుక్కుపోసాగారు.

ఆర్.కె. రాధ కూడా హీరో రారాజా కాల్షీట్స్ కోసం క్యూలో నిల్చున్నాడు. అర్నెల్ల క్రితం అతనికి కాల్షీట్స్ దొరికాయి. రారాజా ఇరవై లక్షలు తీసుకున్నాడు. ఆ రేంజిలోనే డైరెక్టర్, హీరోయిన్‌కి నాలుగు, విలన్‌కి నాలుగు, అన్నీ లక్షలే. హీరో వెంట పదిమంది వందిమాగధులు. వాళ్ళకి హీరోతో పాటు సకల సౌకర్యాలు. విమానం చార్జీలు, ఫైవ్ స్టార్ హోటల్లో గదులు. హీరోయిన్‌తో పాటు చెలికత్తెలు, అమ్మ' చెల్లెళ్ళు, తమ్ముళ్లు, వాళ్ళందరికీ ప్రొడ్యూసర్ ఖర్చుతో తిండి తిప్పలు. పిక్చర్ పూర్తికావొచ్చింది. ఖర్చు తొంభై లక్షలు తేలింది.

"ఆర్.కె. రాధ దురదృష్టం. కొన్ని సినిమాలు ఫ్లాప్ అయ్యేసరికి జిల్లా డిస్ట్రిబ్యూటర్లు మద్రాస్ రావడం మానేశారు. అడ్వాన్సులు వదులుకున్నారు.

రారాజా కాదు వాడి తాత వున్నా అంత రేటు పెట్టి పిక్చర్ కొనేవాళ్ళు మార్కెట్‌లో దొరకలేదు. అడ్వాన్సులు ఇచ్చిన వాళ్ళు కొందరు గుండె ధైర్యంతో వచ్చారు. కొందరు పత్తాలేరు.

పిక్చర్ రిలీజ్ చెయ్యడం ఎట్లా అని ఆర్.కె. రాధను మనోవ్యాధి పట్టుకుంది.

ముఖ్యంగా రోజులు గడిచేకొద్దీ ఫైనాన్స్‌మీద వడ్డీ పాపంలా పెరిగిపోతోంది. హీరో, హీరోయిన్, విలన్ వగైరాల చుట్టూ తిరిగాడు రేటు తగ్గించమని. ఇదిగో అదుగో అని చుట్టూ త్రిప్పుకోసాగారు. ఒకప్పుడు వాళ్ళంతా ఛాన్సులకోసం అతని చుట్టూ తిరిగినవారే,

అయితే నేం ఇప్పుడు పరిస్థితి తారుమారైంది.

ఆర్. కె. రాధ సంపాదించుకున్నదంతా పెట్టినా పిక్చర్ రిలీజ్ అయ్యే పరిస్థితి లేదు. ఆర్నెల్లు నరకం అనుభవించాడు. ఇక లాభం లేదని నష్టానికి పిక్చర్ రిలీజ్ చేసెయ్యాలని నిశ్చయించుకున్నాడు. కాని ఫైనాన్స్ గొంతు పట్టుకుంది.

ముప్పై లక్షలు బాకీ తేలింది. పదిహేనులక్షలు చెల్లించే ఏర్పాటు జరిగింది. మూడు జిల్లాలు అడ్వాన్సులు ఇచ్చిన వాళ్ళు వదిలేశారు. కొత్తగా ఎవరూ ముందుకు రావడం లేదు.

ఒక పెద్ద కంపెనీతో ఫ్రీ డిస్ట్రిబ్యూషన్ మాట్లాడుకున్నాడు. అదీ పెద్ద అబ్లిగేషన్ మీద.

కాని మొత్తం డబ్బు చెల్లించనిదే పిక్చర్ రిలీజ్ చెయ్యడానికి ఫైనాన్సియర్ ఒప్పుకోడు.

అందుకే ఆర్. కె. రాధ తిప్పలు.

“రాఘవన్ గారూ ఇంత దరిద్రం ఎప్పుడూ లేదండి. పొరపాటున ఊబిలోకి దిగాను. బడ్జెట్ పిక్చరొకటి ప్లాన్ చేసి వుంటే ఇలా జరిగేది కాదు.”

రాఘవన్ పరధ్యానంగా తల వూపుతున్నాడు.

“పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లుంది నా పని. అందరూ హీరోలతో లక్షలు లక్షలు వెనకేసుకుంటున్నారని దురాశకు పోయాను. అసలు తెలుగు సినిమాకు కోటిరూపాయల బడ్జెట్ ఏమిటండీ నా బొంద. హిందీ, ఇంగ్లీషు అయితే ఫరవాలేదుగాని.”

రాధ అక్కసు వెళ్ళబోసుకుంటున్నాడు.

బైట ఎండ తగ్గింది. లోపల కూర్చున్న రాధకు కాలం తెలియడంలేదు. రాఘవన్ని ప్రసన్నం చేసుకోవ

డానికి ఫీల్డులో వున్న లొసుగులన్నీ ఏకరువు పెడుతున్నాడు. అవేవీ రాఘవన్ కి తెలియనివి కావు. గత్యంతరం లేక 'వూఁ' కొడుతున్నాడు.

ఈలోపల రాధ మేనల్లుడు కుమార్ వచ్చాడు. ఇద్దరూ బైటకెళ్ళారు. కాసేపు గుసగుసలాడుకున్నారు.

కుమార్ రాఘవన్ దగ్గరికి వెళ్ళాడు.

“సార్! మీరు తాజ్ కోరమాండల్ కి ఒకసారి రావాలి. సాయంకాలం ఏడుగంటలకి, తప్పకుండా.”

రాఘవన్ ముఖం ప్రసన్నమైంది.

“ఏమిటి విశేషం?”

“విశేషమే. చిన్న గెట్ టుగెదర్. మన పిక్చర్లో హీరోయిన్ మాలిని వస్తుంది.”

“ఈజిట్ ?” అన్నాడు రాఘవన్.

అతని ముఖం స్విచ్ వేసిన బల్బులా వెలిగింది.

కుమార్ తల వూపాడు.

“నేను మీకోసం వెయిట్ చేస్తుంటాను” అన్నాడు.

రాఘవన్ “సరే” అన్నాడు.

మాలిని అతని ఫేవరెట్ స్టార్. ఆమె అందం అతనికి ఇష్టం. ఆమె గ్లామర్ అతనికి కల్లో కనిపిస్తుంటుంది. ఆమెను దగ్గరగా చూడ్డంకోసమే ఎన్నోసార్లు షూటింగులకు హాజరయ్యేవాడు. అయితే అతనికి ఆమె పరిచయ భాగం కలగలేదు.

అతనికి చాలా సంతోషంగా వుంది.

సరిగ్గా ఏడుగంటలకు అతను తాజ్ కోరమాండల్ మెయిన్ గేటు దగ్గరున్నాడు. అతని కారు నెమ్మదిగా అప్ ఎక్కుతోంది. తల బైటపెట్టి చూశాడు.

కుమార్ కనిపించాడు.

కారు ఆగింది.

"మీకోసం ఎదురు చూస్తున్నారు."

కుమార్ నవ్వాడు.

ఇద్దరూ లిఫ్ట్‌లో పైకి వెళ్ళారు.

గదిలో ఎవ్వరూ లేరు.

"ఎవరూ లేరేం?" ఆశ్చర్యంగా అడిగాడు రాఘవన్.

"పార్టీ మీ ఒక్కడికే."

"మరి మాలిని."

"వస్తుంది. ఇప్పుడే ఫోన్ చేశాను. బయల్దేరారని చెప్పారు. మీరు కూర్చోండి. నేనామెను రిసీవ్ చేసుకుంటాను."

రాఘవన్ తలవూపాడు.

కుమార్ వెళ్ళిపోయాడు.

అరగంట తర్వాత తలుపు నెమ్మదిగా తెరుచుకుంది. జాస్మిన్ పరిమళం గదంతా వ్యాపించింది.

రాఘవన్ కళ్ళముందు మెరుపుతీగ ప్రత్యక్షమైంది.

"వీరు రాఘవన్ గారు. స్రవంతి ఫైనాన్సియర్స్" కుమార్ పరిచయం చేశాడు.

"నమస్తే."

మాలిని రెండు చేతులు జోడించింది.

రాఘవన్ లేచి నిల్చున్నాడు అబ్బురపాటుతో. నమస్తే చెప్పాడు.

"కూర్చోండి" అంది మాలిని.

అందరూ కూర్చున్నారు.

"రాఘవన్ గారు తెలియక పోవడం ఏమిటి?" అంది మాలిని.

రాఘవన్ వుబ్బితబ్బిబ్బు అయ్యాడు.

మాలినికి ముఫ్ఫై యేళ్ళొంటాయి. కత దశాబ్దంగా సూపర్ స్టార్. ఇప్పుడు ఆమెకు పోటీ ఎక్కువయింది. నెలకో హీరోయిన్ మళయాళం, అరవం, కన్నడం, హిందీ ఫీల్డుల నుంచి తెలుగు తెరకు పరిచయమౌతు న్నారు. ఇదివరకులా ఆమెకు బుకింగ్స్ లేవు. తన స్థానాన్ని నిలబెట్టుకోవాలని తపన పడుతోంది.

ఆమె నటించిన కొన్ని సినిమాలు ఫ్లాప్ కావడంతో, నిర్మాణంలో వున్న సినిమాలు ఆగిపోవడం మనసుకి క్షోభ కలిగించింది. రాధ సినిమా రిలీజ్ అయి హిట్ అయితే తనకు మళ్ళీ గ్లామర్ పెరుగుతుందని ఆశపడింది. కాని అది ఫైనాన్షియర్ చేతిలో చిక్కుకుని వుందని తెలిసి తన వంతు కృషి చేయకిడానికి ప్రయత్నం చేస్తోంది. రాఘవన్‌కి తనంటే అభిమానమని విన్నప్పుడు ఆమెకు సంతోషం కలిగింది. తారలకు ఫైనాన్షియర్స్ ఫాన్స్‌గా వుంటే ఎంతో లాభం వుంది.

మాలినికి వయసు మళ్ళుతున్నా బుకింగ్స్ లేక పోయినా రాఘవన్ దృష్టిలో ఆమె అందాల అప్సరసే. అతని ఆరాధ్య కథానాయికే

రాఘవన్ తనివితీరా ఆమె అందాన్ని కళ్ళతో కె ఆరాధిస్తున్నాడు.

కుమార్ తెచ్చిన రాయల్ సెల్యూట్ విస్కీ ఫుల్ బాటిల్ ఖాళీ అయింది. అందులో కుమార్ కొంచెం తీసుకున్నాడు. అధిక భాగం రాఘవన్ లాగించాడు. మాలిని అతనితో పోటీపడింది.

"రాఘవన్ గారూ, రాధాగారి పిక్చర్ యెప్పుడు రిలీజు చేయిస్తున్నారు?" అడిగింది మాలిని అతన్ని ఓర

కంఠం చూశా.

రాఘవన్ వెంటనే సమాధానం చెప్పలేదు. మత్తులో వున్నా అతని మనసు షార్పుగానే వుంది.

"ఎలాగండీ ముప్ఫై లక్షలుంది బాకీ" అన్నాడు.

"ఫిఫ్టీ పర్సెంట్ పేమెంట్ చేస్తాం సార్!" అన్నాడు కుమార్.

ఆ మాట కొత్తది కాదు, రాధ చెప్పిందే.

"కుమార్ గారూ! నేను వారితో మాట్లాడి ఎరేంజి చేస్తాగదా!" అంది మాలిని.

కుమార్ సెలవు తీసుకొని వెళ్ళిపోయాడు.

మాలిని లోపల బోల్టు పెట్టేసి వచ్చింది.

రెండు రోజుల తర్వాత "రారాజు శపథం" ఆగష్టు పదిహేను రిలీజ్ అని పేపర్లో పడింది.

ఆ రోజు ఆగష్టు ఏడు.

కిరణ్ టెలిఫోన్ రిసీవర్ యెత్తి నెంబర్ డైల్ చేశాడు.

"రాజేంద్రప్రసాద్ హియర్!...." అని వినిపించింది.

రిసీవరు విజయ చేతికి యిచ్చి మాట్లాడమని సైగ చేశాడు.

"సర్, నేను రీటాని మాట్లాడుతున్నాను. స్రవంతి ఫైనాన్స్ నుంచి."

"చెప్పు యేం కావాలి?" విసుగ్గా వినిపించింది అతని కంఠం.

"ఒక ముఖ్యమైన విషయం మీకు చెప్పాలని ఫోన్ చేశాను సర్."

"ముఖ్యమైన విషయమా?"

"యస్, సర్!"

"చెప్పు ఏమిటో?"

"మన కంపెనీ ఆర్. కె. రాధ అనే ప్రొడ్యూసర్ పిక్చర్‌కి పాతిక లక్షలు ఫైనాన్స్ చేసింది. వడ్డీతో కలిపి ముప్ఫై లక్షలు అయింది. అతని పిక్చర్ 'రారాజా శపథం' ఆగస్టు 15 రిలీజ్ కాబోతూ వుంది."

"అయితే యేమిటి?"

"అదే చెప్తున్నా సర్! ఆర్. కె. రాధ మనకు రావాల్సిన బాకీ పూర్తిగా చెల్లించలేదు. పదిహేను లక్షలు మాత్రమే పేమెంట్ చేశాడు."

"బాలన్స్ రిలీజ్ లోపల చేస్తాడేమో?"

"లేదు సర్! వైజాగ్, ఈస్ట్ గోదావరి జిల్లాలమీద రాయల్టీ రాసిస్తున్నాడు."

"రాయల్టీ యేమీ రాకపోతే?"

"ఏమో సర్. అది మీరు రాఘవన్‌ని అడిగి తెలుసుకోవలసిన విషయం."

"వాడు యేమైనా లాలూచీ పడ్డాడా?"

"లేకపోతే రిలీజ్‌కి యెలా ఒప్పుకుంటాడు సర్?...."

"సరే, ఇప్పుడే వాడి సంగతి తేలుస్తా."

"మీరు సాయంకాలం లోపల రండి! ఎగ్రిమెంట్స్ టైప్ చేయిస్తున్నారు."

"సరే!"

"మరో సంగతి. హీరోయిన్ మాలిని, రాఘవన్ తాజ్ కోరమాండల్లో మొన్న రాత్రంతా గడిపారని తెలిసింది."

"ఊం...." అన్నాడు రాజేంద్రప్రసాద్.

విజయ రిసీవర్ క్రేడిల్ చేసింది.

కిరణ్ మరో నెంబరుకి రింగ్ చేశాడు.

“రాజేంద్రప్రసాద్ ఆఫీసుకు వస్తున్నాడు. వాళ్ళిద్దరికీ యేం జరిగిందో విని నాకు చెప్పాలి. కే. కే.” అన్నాడు.

“వాళ్ళిద్దరూ యిప్పుడు కొట్టుకు చస్తారు” అని నవ్వాడు కిరణ్.

చెప్పా చెయ్యకుండా వూడిపడ్డ రాజేంద్రప్రసాద్ ని చూసి స్టాఫ్ కంగారు పడ్డారు స్రవంతి ఫైనాన్స్ కంపెనీలో. అతను యెప్పుడో గాని ఆఫీసులోకి అడుగు పెట్టడు.

రాఘవన్ బిత్తరపోయాడు.

లేచి నిల్చున్నాడు.

“కూర్చో” అన్నాడు రాజేంద్రప్రసాద్ కరుగ్గా.

రాఘవన్ ముళ్ళమీద కూర్చున్నట్లు కూర్చున్నాడు. అతనికి లోలోపల అదురుగా వుంది. తను పదిహేను లక్షలు రిస్క్ చేస్తున్నాడు. రారాజు శపథం రిలీజ్ అయిన తర్వాత ఓవర్ ఫ్లో రావచ్చు, రాకపోవచ్చు. అదంతా డిస్ట్రిబ్యూట్ చేస్తున్న కంపెనీదయు. అటువంటి రిస్క్ ప్రొడ్యూసర్ కి తప్పనిసరి కావచ్చుగాని ఫైనాన్సియర్ కి కాదు. అటువంటిది తను రిస్క్ చేస్తున్నాడు. ఆ విషయం ముప్పాతిక వంతు పార్ట్‌నర్ అయినటువంటి రాజేంద్రప్రసాద్ కి చెప్పాల్సింది. కాని తను చెప్పలేదు. ఆయన పట్టించుకోడు మామూలుగా. అదే ధైర్యంతో ఒప్పుకున్నాడు.

“ఆర్. కె. రాధ పిక్చర్ రిలీజ్ చేస్తున్నాడటగా” అడిగాడు రాజేంద్రప్రసాద్.

"అవును. ఆగస్టు పదిహేను" చెప్పాడు రాఘవన్ తత్తరపడుతూ.

"డ్యూ ఎంత వుంది?"

"ముప్పై!"

"పేమెంట్ చేశాడా?"

"పదిహేను చేశాడు."

"బాలన్స్ రిలీజ్ లోపల చేస్తాడా?"

రాఘవన్ గుడ్లు తేలేశాడు.

"వైజాగ్, ఈస్టు మనకి...."

రాజేంద్రప్రసాద్ అడ్డు వచ్చి "వైజాగ్, ఈస్టు అంటూ ఏమిటి?" అన్నాడు.

"ఆ జిల్లాలు ఎవరూ కొన్లేదు. రాయల్టీ మనకి వస్తుంది బాకీ తీరేవరకు. ఆ విధంగా అగ్రిమెంట్ రాసిస్తున్నాడు" చెప్పాడు రాఘవన్.

"నాన్సెన్స్. ఆ రిస్కు మన కెందుకు?"

"మరేం చేస్తాం."

"మతి లేకుండా మాట్లాడుతా వెందుకు రాఘవన్? బాకీ తీర్చకుండా పిక్చర్ రిలీజ్ చెయ్యనిస్తాడా యే ఫైనాన్సియర్ అయినా?" గట్టిగా అన్నాడు రాజేంద్రప్రసాద్.

"అతను బాకీ తీర్చేవాడే. కాని యిప్పుడు స్లంప్ వుంది. అతను బాకీ తీర్చే పరిస్థితిలో లేడు. నిండా మునిగాడు."

"వాడితో పాటు మనమూ మునగాలా?"

"అలా అని ఎవరన్నారు? కొంచెం రిస్కు తీసుకోవాలి. అంతే."

"మనకేం ఖర్మ? బాకీ తీరితేనే పిక్చర్ రిలీజ్ అవు

తుంది, దట్సాల్. రూపాయలు ఫ్యాక్టరీలో అచ్చు కొట్టడం లేదు రాఘవన్. నిన్ను నమ్మి లక్షలు చేతిలో పోసినందుకు బాగా చేస్తున్నావు" నిష్ఠూరంగా అన్నాడు రాజేంద్రప్రసాద్.

రాఘవన్, రాజేంద్రప్రసాద్ తీవ్రంగా మాటా మాటా అనుకున్నారు.

"నేనెవర్నీ నమ్మేపరిస్థితిలో లేను మిస్టర్ రాఘవన్. నా స్వంత బామ్మర్ది దగా చేశాడు. అల్లుడు మోసం చేశాడు. వాళ్ళకంటే నువ్వేం ఎక్కువ వాడివి కాదు" అని లేచిపోయాడు.

రాఘవన్ ఏం చెప్పినా విన్లేదు.

"నేనేం వినను. ఏ ప్రొడ్యూసరైనా ఫుల్ సెటిల్మెంట్ చెయ్యకుండా పిక్చర్ రిలీజ్ చెయ్యడానికి నేనొప్పుకోను. దట్సాల్" అని హెచ్చరించి వెళ్ళిపోయాడు.

రాజేంద్రప్రసాద్ నిష్క్రమించాక గాలివాన వెలిసినట్లయింది ఆఫీసులో.

స్టాఫ్ వింటున్నారనిగూడా చూడకుండా తనని దులిపి వెయ్యడం రాఘవన్‌కి తల కొట్టేసినట్లయింది.

చాలాసేపు తేరుకోలేకపోయాడు ఆ దాడి నుంచి. అసలు ఈ విషయం అతనికి ఎవరు చెప్పారో? ఎలా తెలిసిందో రాఘవన్‌కి చచ్చినా అర్థంకావడంలేదు.

ఎవరికి తెలుసు ఈ విషయం?

మాలిని?

కుమార్?

ఆర్.కె. రాధ?

వాళ్ళెవరూ రాజేంద్రప్రసాద్‌తో చెప్పే అవకాశం

లేదు. మరెవరు చేరవేశారు?

స్టాఫ్‌లో ఎవరైనా తెలుసుకుని....?

రాఘవన్ ఫోన్ ఎత్తి ఆర్.కె. రాధకి డైల్ చేశాడు.

"రాధగారూ! మీరు మా పార్టనర్‌కి అగ్రిమెంట్ సంగతి చెప్పారా ఏమైనా?"

"లేదండీ చెప్పలేదే? ఏం జరిగింది?"

"ఆయనకెలాగో తెలిసిపోయింది. ఫుల్ అండ్ ఫైనల్ సెటిల్‌మెంట్ అయితేగాని పిక్చర్ రిలీజ్ కావడానికి వీల్లేదని కేకలుపెట్టి పోయాడు. ఐయామ్ సారీ రాధగారూ!"

రాఘవన్ ఫోన్ క్రెడిల్ చేశాడు. తర్వాత సీట్లో నుంచి లేచిపోయాడు.

తర్వాత

'రారాజా శపథం' ఆగస్టు పదిహేనున రిలీజ్ కాలేదు.

ఫైనాన్సియర్స్ కోర్టుకెళ్ళి స్టే తెచ్చారని పేపర్లో వార్త పడింది.

తన పిక్చర్ రిలీజ్ కాకుండా అడ్డుపడిన స్రవంతి ఫైనాన్స్ కంపెనీ పార్టనర్ రాజేంద్రప్రసాద్ ఇంటిపైకి గూండాలతో దాడిచేసి రాళ్ళు విసిరి అల్లరిచేసినందుకు, తాగి గొడవచేసినందుకు ఆర్.కె. రాధను పోలీసులు అరెస్టు చేశారు. తర్వాత బెయిల్ మీద విడుదలచేశారు.

32

ఫిలిప్స్ హోటల్లో తన ప్రైవేట్ రూమ్‌లో కూర్చుని విస్కీ తాగుతున్నాడు, రాజేంద్రప్రసాద్.

ఈమధ్య అతనికి మనశ్శాంతి కరువై రోజూ తాగుతున్నాడు. రోజూ ఇంటికి వెళ్ళేవాడల్లా మానేశాడు.

అక్కడే నిద్రపోతున్నాడు. మనిషి చాలా డీలాపడినట్లు కనిపిస్తున్నాడు. అతనికి లోకం అంతా మాయగా మోసంలా తోస్తోంది. ఎవర్నీ నమ్మడంలేదు. బి.పి. ఎక్కువై తరచుగా స్టాఫ్ మీద విసుచుకు పడుతున్నాడు.

అప్పుడు రాత్రి ఎనిమిది.

ఆర్.కె. రాధ వచ్చి క్షమాపణ కోరాడు. తన పిక్చర్ రిలీజ్ ఆగిపోయిందన్న బాధలో తాగి వచ్చి గొడవ చేశానని చెప్పుతున్నాడు. దయచేసి పోలీస్ కంప్లెయింట్ విత్ డ్రా చేసుకోమని కోరాడు. తర్వాత చూద్దాంలే. వెళ్ళి రమ్మన్నాడు. అతన్ని చూస్తే ఎలర్జీగా వుంది రాజేంద్రప్రసాద్ కి.

అరగంట తర్వాత అతని పర్సనల్ అటెండర్ గోపీ. వచ్చి "సుష్మా అనే అమ్మాయి ఢిల్లీనుంచి వచ్చింది" అని చెప్పాడు.

లోపలకి పంపించమన్నాడు.

"నమస్తే ప్రసాద్ జీ!" అంది సుష్మా.

అతను ఆమెను కూర్చోమన్నాడు!

"చెప్పు ఏమిటి?" అన్నాడు.

"నేను డాన్సర్ని. నాగిన్ డాన్సు నా స్పెషల్ ఐటమ్" అంది.

అతను జవాబు చెప్పలేదు.

ఆమెను పరిశీలనగా చూశాడు. ఆమె అందం జిగేల్ మని మెరుస్తోంది. కోల ముఖం, కోటేరు ముక్కు, ప్రకాశవంతమైన పెద్ద కళ్ళు, కెల్లటి శరీరం, కొప్పు గోపురంలా పైకి పోతున్నట్లు కనిపిస్తోంది. ఆమె ముఖం పడగవిప్పిన పాములా వుంది.

సన్నగా నాజూకుగా వుంది. (ఇంకా వుంది)